# పీఠిక

"ఆరుద్ర"

పంకజం చాలా విచిత్రమైన అమ్మాయి. ఇలాంటి వాళ్ళు ఆకుపచ్చని నీరెండ సాయంకాలాల లాగ బహు అరుదుగా ఉంటారు. పంకజానిది దిగుడు బావిలాంటి గుండె. మెదడనేది విశేషంగా ఉన్నా అందరితోనూ గుండెతోనే స్నేహం చేస్తుంది. పంకజం జీవితంలోనికి మహా సులువుగా జొరబడవచ్చు. ఎంత వేగం ఆమెతో స్నేహం కడతారో అంత వేగంగానే చాలామంది ఆమె చంచల ప్రవర్తనని చూసి అచుట్టుప్రక్కల నుంచి నిష్క్రమిస్తారు.

రామారావు కూడా విచిత్రమైనవాడే. మానవులకీ జంతువులకీ ఏవిధమైన సంబంధమైనా ఉంటే కొన్ని కొన్ని విషయాలను రామారావుని ఉపమానంగా చూపెట్టి ఋజువు చెయ్యవచ్చు. ఆడవాళ్ళ విషయాలలో రామారావుకి ఆలోచించడం అనే మానవనైజం మృగ్యం. తక్కిన వాళ్ళలాగ రామారావు పంకజం జీవితంలోకి ప్రవేశించ లేదు. పంకజమే అతడితో జోక్యం కలిగించుకొంది.

పదిమందిలో కూర్చొనడం, కలుపుగోరుతనం, చమత్కారమైన సంభాషణ మొదలైన వాటిపట్ల రామారావుకి విముఖత ఉన్నా మరీ కావలసిన స్నేహితుడు కాల్చుకు తినడంవల్ల విధిలేక అతడి జన్మదినము విందుకి వెళ్ళ వలసివచ్చింది. స్నేహితుడి ప్రత్యేకపు కోరికమీద రామారావు అంతా వెళ్ళ వలసిన వేళకు కొద్దిగా ముందే విందు చోటికి చేరుకున్నాడు.

స్తబ్ధుగా ఒక సోఫాలో కూర్చొని దీక్షగా సాయంకాలపు పేపరు చదువుతూ తన మానాన్న తను ఎవరినీ పట్టించు కొనకుండా ఉన్నాడు. విందుకాహ్వానించబడిన వాళ్ళలో ఒకరిద్దరు తప్ప తక్కిన వాళ్ళు రామారావుని ఎరగరు. ఒకొక్క అతిథే ప్రవేశించి నప్పుడు రామారావుని స్నేహితుడు వాళ్ళకి పరిచయం చేస్తున్నాడు. పాఠం వప్పచెప్పినట్టు నమస్తే అన్న ముక్క వెంటనే తను పత్రికలో మునిగి పోకపోతే ఎదో పుట్టి మునిగి పోయేటట్టు తొందరగా అనేసి ఊరుకొంటున్నాడు రామారావు. 'ఏనిమిది వందల వోల్టుల అపాయం' అన్న ఎర్ర బోర్డు అతడి మొగం మీద కట్టబడినట్టు అతిథులుకూడా అతడి జోలికి పోలేదు.

రామారావు పక్కన సోఫాలో కూర్చున్న పెద్దమనిషి మర్యాదకోసం సిగరెట్టు కేసు అందించినప్పుడు కూడా రామారావు నోరు విప్పకుండానే "అక్కర్లేదు ధన్యవాదాలు" అని మొఖంతోటే ప్రకటించీ ప్రకటించనట్లు తెలియచేసేడు. దీనితో ఆపెద్దమనిషి మర్యాదాకి దండంపెట్టి మరి సిగరెట్టు అందించిన పాపాన పోలేదు. రామారావుకూడా తన చుట్టూ చెలరేగుతున్న సంభాషణల బొబ్బలనీ, ఆసికాల కోలాహలాన్నీ హాలాహలంలాగ ఎంచుకొంటూనే తనని ఏవిధంగానూ తృప్తి పెట్టని వార్తలని చదువుతున్నాడు.

ఒక్క అయిదు నిముషాలలో తన చుట్టూరా ఏం జరుగు తున్నాదో కూడా మరచి పోయేడు. సముద్రపు ఒడ్డున కూర్చొని హోరుని సులభంగా మరచి పోవచ్చు.

ఇంతలో స్నేహితుడు "రామం, ఈమె శ్రీమతి పంకజం" అని తనకు పరిచయం చేసేదాకా ఈ విందులో ఒక ఆడపిల్లకూడా పాల్గొంటున్నది రామారావుకి తెలియలేదు. తక్కిన వాళ్ళతోలాగ పరిచయం చేయబడుతున్నప్పుడు "నమస్తే" అని ఊరుకొనవలసింది గానీ ఒక అమ్మాయి ఈ



http://www.maganti.org

విందు కొచ్చిందా అన్న ఆశ్చర్యంలోనుంచి తట్టు కొనడానికి కావలసినంత వ్యవధి తీసుకొని మరీ పత్రికను మొఖానికి అడ్డుపెట్టుకొన్నాడు.

రామారావు స్వభావం ఇలాటిది అని ముందే ఎరిగి ఉంటే పంకజం ఒకంతట అతడిని విడిచి పెట్టి ఉండదు. అదీకాక అతడిలో చప్పున ఆకర్షించే ఏవిధమైన శక్తీ లేదు. తదితర ఆహూతులు అందరూ పంకజానికి చిరపరిచితులే. వాళ్ళతో ఆమాటా ఈమాటా కలుపుతూ కొంతమందిని రకరకాల ప్రశ్నలతో నానా ఇబ్బంది పెడుతూ ఆ గోలలో లీనమైపోయింది.

ఒక పది నిముషాలు పోయాకగానీ ఈ సంభాషణలలో రామారావు పాల్గొనటం లేదని పంకజం గ్రహించ లేకపోయింది. కొత్తవాళ్ళతో సంభాషణ కలపడం తన లాంటివాళ్ళకి వెన్నతో పెట్టిన విద్య కాబట్టి అంతా తనలాగే ఉంటారనిగానీ ఉండాలని గానీ నమ్మేటంత అవివేకస్తురాలు కాదు కాబట్టి పంకజం రామారావు విముఖతని అపార్థం చేసుకొంది. కొత్త సిగ్గు పడుతున్నాడు అనుకొంది అయినా ఈ స్నేహితుడి విందుకు వచ్చేవాళ్లు అంత బిడియ పడతారని అనుకోలేదు.

ఇంతలో అందరూ విస్తర్ల ముందు కూర్చొన్నారు. స్నేహితుడు పెంకితనంగానే కావాలని రామారావుకి పంకజం పక్కనే విస్తరి ఏర్పాటు చేశాడు. రామారావు కీఏర్పాటు కొంచెం చికాకవిపించేదే గానీ పట్టించుకో దలచనప్పుడు ఎక్కడ కూర్చుంటే నేమని తమాయించుకొన్నాడు. భోజనం చేస్తున్నప్పుడు పంకజం తన మామూలు ధోరణిలో అతడితో మాట్లాడడం ప్రారంభించింది. ఆవేళ వంటకాలలో రుచికరమైనది వంకాయ ఉల్లి కూర. అవిషయం ప్రస్తావించి "ఏమండీ వంకాయ వాతం చేస్తుందంటారు నిజ మనేనా" అని అడిగింది. జవాబు చెప్పడం అన్నం నములుతూ మింగేశాడు. ఈలోగా సమాధానం కోసం ఆగకుండా ఆటుపక్కవాడు అడిగినదేదో పట్టుకొని అందులో మునిగిపోయింది. వంటవాడు కూర మారువేస్తున్నాడు. రామారావు అక్కర్లేదని చెయ్యి అడ్డం పెట్టేడు. ఆ సమయానికే పంకజం "వాతం చేస్తే చేసింది గానీ రుచైనదాన్ని ఇష్ట మొచ్చినంత తినకపోడంలో అర్థంలేదు. అన్నట్టు డాక్టరుగారూ వంకాయ వాతం చేస్తుందో లేదో చెప్పేరుకారేం' అని అంది. రామారావుకి మండు కొచ్చింది. ప్రశ్నిస్తే ప్రశ్నించింది గాని 'డాక్టరుగారూ' అని లేనిపోని డిగ్రీలు తగిలిస్తుం దేమూ అన్న కోపంతో "నేను డాక్టర్ని అని ఎవరు చెప్పేరు?" అని అడిగేశాడు "మీ సీరియస్‌నెస్ చూస్తే డాక్టరులా అగుపడారు" అంది. "డాక్టర్లంతా విధిగా సీరియస్‌గా ఉండాలా" అని అడిగేడు. ఏమో - సీరియస్‌గా ఉన్నవాళ్ళని చూస్తే నాకు డాక్టర్లు జ్ఞాపకం వస్తారు. పోండి మీరు ఎవరైతే నేం, వంకాయ వాతం చేస్తుందో లేదో చెప్పారు కాదు" అని మళ్ళా సతాయించింది, "డాక్టరుగారూ! అని అతి మందరంగా కొంటెగా నవ్వుతూ. ఈసారి డాక్టరు గారూ అన్న సంబోధనకి రామారావుకి కోపం రాలేదు. అప్రయత్నంగా తనూ నవ్వుతూనే "వాతం సంగతి నాకు తెలీదుగాని వంకాయలాంటి కూర లేదంటారు, ఆమాటకొస్తే దానిమీద పద్యాలుకూడా ఉన్నాయి. వంకాయవంటి కూరయు, లంకాపతి వైరివంటి రాజూయు మరియున్ శంకరుని వంటి దైవము అంటూ" అని పెద్ద సమాధానమే చెప్పాడు. పంకజం ఈ సమాధానానికి కొంచెం ఆకర్షించబడింది. సీరియస్‌గా ఉండేవాడూ, డాక్టరు కానివాడూ పద్యాలను ఉదహరించేవాడు ఇక డెవరా అని. ఇతనితో ఇన్నాళ్ళదాకా తనకి పరిచయ మెందుకు కాలేదా అనీ పంకజం కొద్దిగా ఆశ్చర్యపోయింది. అటుపక్క మరో అతిథి కూర్చున్నాడన్న విషయాన్ని ఆశ్చర్యంతో మరచిపోయి సంభాషణనంతా రామారావు వైపుకే తిప్పింది. రామారావుకూడా తనకి నలుగురుమధ్య కూర్చోబెడం



http://www.maganti.org

ఏవగింపు అన్న విషయాన్ని మరచిపోయి పంకజం ప్రశ్న లన్నిటికీ సమాధానాలు చెపుతున్నాడు.

"డాక్టరుగారూ! మీకు తెలుసో తెలిదో గానీ నేను వంకాయకూర వండుతానూ, ఎంత బాగా వండుతా ననుకొన్నారు. మీరు ఒకసారి వచ్చి రుచి చూడాలి. ఎప్పు డొస్తారు. రేపు ఆదివారం మా యింటికి భోజనానికి రావాలి. నన్ను చూసినవాళ్ళు నాకు వంట రాదనుకొంటారు గానీ బాగానే వండుతాను" అన్నాది పంకజం. "ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పింపగన్" అన్నాడు రామారావు.

రామారావు పంకజంతోటి విరామంలేని సంభాషణని కొనసాగించడం కనిపెట్టి స్నేహితుడు కొంచెం ఇబ్బంది పడ్డాడు. అతడు దూరంగా కూర్చొన్నా వీళ్ళిద్దర్నీ ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు. వీళ్ళ సంభాషణ కొనసాగుతున్నకొద్దీ అతడికి ముళ్ళమీద కూర్చొవున్నట్టున్నా రామారావుని అతడు చిన్నప్పట్నుంచీ ఎరిగున్నాడు కాబట్టి కొంచెం సంబాళించు కొంటున్నాడు. స్నేహితుడు గాభరా పడేందుకు జెలసీ కారణం కాదు. పంకజాన్ని ఇతడు విశేషించి ప్రేమించడంకూడా లేదు. ఆమాటకొస్తే పంజం అంటే అంతరాంతరంలో అతడికి పీసమెత్తు ఏవగింపుకూడా ఉంది. అయినా ఒకనాడు పంకజం "నాకే బుద్ధిపుడితే ఏ మొగాణ్ణి కావలసివస్తే వాణ్ణి కుక్కలాగ వెంట తిప్పుకోగలను. పంతంపట్టి మొగాళ్ళందర్నీ వెర్రెత్తించగలను" అని అంది. స్నేహితుడు "ఒకానొకణ్ణి తప్ప" అన్నాడు. 'ఎవరిని' అని ప్రశ్నించినా, తనని తప్ప అని ఉద్దేశించేదేమో అనుకొని అక్కడితో సంభాషణని ఆ విషయంమీద ఆపుచేసింది. స్నేహితుడికి తెలుసు. రామారావు ఆడవాళ్ళని చూసి వెర్రెత్తిపోడని, పంకజం లాంటి వాళ్ళకి లొంగిపోడని గానీ, రామారా వేం ముక్కు మూసుకొన్న మునీ కాదు, జితేంద్రియుడూ కాదన్న సంగతీ స్నేహితుడికి తెలుసు. అదీకాక "రామారావుని నువ్వు వెంట కుక్కలా తిప్పుకోలేవు" అని పంకజంతో మరీ గట్టిగా చెబితే రోషంకొద్దీ పంకజం రామారావుని తనవైపు లాక్కొనే పద్ధతులని అవలంబించవచ్చు. అందుకు రామారావు పేరుని అప్పుడు చెప్పలేదు. కానైతే పంకజం గర్వాన్ని అణుద్దామని పట్టుపట్టేడు స్నేహితుడు. ఇది చాలా రోజుల మాట.

ఈమధ్యే స్నేహితుడికి తన పట్టుదలమాట జ్ఞాపక మొచ్చి రామారావుని పంకజాన్ని పిలచిన విందుకు పిలిచేడు. రామారావు మొదట వచ్చిన అతిథు లెవరితోటీ మాట్లాడక పోడం భోజనాలకి కూర్చొనీదాకా పంకజంతోటి మాట్లాడక పోడం చూసి స్నేహితుడు కొద్దిగా గర్వించేడు. రామారావు ఎలాగా పంకజంతోటి మాట్లాడ దన్న ధైర్యంతో పక్కపక్కల విస్తళ్ళు ఏర్పాటు చేశాడు. తీరా వాళ్ళిద్దరూ బాతాఖానీ కొడుతున్నారు. కొంపతీసి రామారావు పంకజం వాక్యాలని ఋజువు చేసేస్తాడా అని భయపడ్డాడు.

భోజనాలయేక తాంబూలసేవకి కూర్చొన్నారు. రామారావు తాంబూలం వేసుకోడం లేదు. స్నేహితుడు వచ్చి వాళ్ళిద్దరిమధ్యా కూర్చొని స్థిమిత పడ్డాడు. "ఏమండీ తాంబూలం వేసుకోరే"మని రామారావుని ప్రశ్నించింది. అతడి సమాధానంకోసం నిరీక్షించకుండానే "నేను ఆకులు చీరి ఇయ్యనా" అని అడిగింది. రామరావు నాకు తాంబూలం అట్టే ఇష్టం లేదు ఇంకా—రమణీ ప్రియదూతిక తెచ్చి ఇచ్చు కప్పురవిడం సేవిస్తే కొంపతీసి ఎక్కడ కవిత్వం పుట్టకొస్తుందో అని మానేస్తాను" అన్నాడు. "నేను రమణీ ప్రియదూతను కానుగా" అని ఆకులు చీరిచ్చింది పంకజం. రామారావు మారు చెప్పకుండా పుచ్చుకొన్నాడు. ఇదంతా చూసి స్నేహితుడు మరీ గాభరాపడ్డాడు. ఇదేమిటి రామారావు ఇంత ఘోరం చేసేస్తున్నాడు. తన రానున్న పరాజయాన్ని భరించ



http://www.maganti.org

లేక అక్కణ్ణుంచి తప్పుకొన్నాడు. కొంత సంభాషణ అయేక "ఆదివారం తప్పకుండా మధ్యాహ్నం భోజనాని కొస్తారు కదూ మా ఎడ్రసు తెలుసా" అని మళ్ళా రామారావుని ఆహ్వానించింది. రామారావు అప్రయత్నంగానే అందుకు అంగీకరించేడు. అతిథులొక్కొకరూ వెళ్ళిపోతున్నప్పుడు స్నేహితుడు పంకజంతో ఆదివారంనాడు కలుస్తానన్నాడు. పంకజం "తప్పకుండా రండి. డాక్టరుగారుకూడా ఆవేళ భోజనాని కొస్తున్నారు" అంది.

రామారావు జీవితంలో అప్పటికి స్త్రీ ప్రవేశించలేదు. పంకజం ప్రవేశంకూడా రామారావు కొద్దిగా జాగ్రతగా ప్రవర్తిస్తే జరక్కపోను. గాని అతనికి తెలియకుండానే అవ్యక్తంగా అతడిలో పంకజం మంచి పీట వేసుకొనేందుకు ప్రారంభించింది. ఆదివారం నాటి ఆహ్వానానికి వెళదామా వద్దా అని ఆలోచించుకొనేందుకు కూడా తీరుబాటు లేకుండా రామారావు పంకజం ఇంటికి వెళ్ళేడు. అప్పటికే స్నేహితుడు వచ్చి ఉన్నాడు. రామారావుని చూడగానే అతడు దిగ్భ్రమ చెందాడు. "డాక్టరుగారు మాట కొట్టేకుండానే వచ్చారే" అని పంకజం ప్రత్యుత్థానం చేసింది. డాక్టరుగా రంటే ఎవరో యాభై ఏళ్ళ ముసిలా డనుకొన్నాడు గానీ రామారావే ఆడాక్టరని ఊహించలేకపోయాడు స్నేహితుడు. "రామారావు డాక్టరేమిటి" అని ఆశ్చర్యంగా ప్రశ్నించేడు స్నేహితుడు. "నాకు డాక్టరుగారే లెండి" అని జవాబిచ్చింది। స్నేహితుడికి మరీ వింతగా తోచిందీ జవాబు. రామారావుకి పంకజంతో ప్రత్యేక సంబంధాలప్పుడే ఉన్నాయా అని, భోజనాలు అయిందాకా సాగిన బాతాఖానీతో మతిచెదిరి అవకాశమైనంత తొందరగా స్నేహితుడు పంకజం ఇంటినుంచీ దాంతోపాటే పంకజం జీవితంనుంచి తాత్కాలికంగా నిష్క్రమించేడు.

తనకి తెలియకుండానే రామారావు ఆదివారం మధ్యాహ్నం పన్నెండు గంటలకి వెళ్ళినవాడు సాయంత్రం ఆరుదాకా గడిపేడు. "పంకజం ఏమండీ కూర ఎలా ఉందండీ" అని అడిగింది. జవాబుగా రామారావు బసవరాజు పాటని పాడేడు. చక్కటి గొంతుక కాకపోయినా పంకజానికి గుత్తివంకాయకూర పాట రామారావు పాడుతున్నప్పుడు బాగా ఉన్నట్లనిపించింది. "కూరలోపలా నా కన్నెవలపు కూర్చిపెట్టితి నోయ్ బావా" అన్న చరణం పాడెయ్యడం అయిపోయాక రామారావు చాలా విచారించేడు. ఏమి టింత అసభ్యంగా పంకజం ఏమిటో తన్ను ప్రేమించాలన్నట్లు తను తనకి తెలియకుండానే వాంఛించడం? అదీకాక ఆ అమ్మాయి ఇందుకు నొచ్చుకొన్నా నొచ్చుకొనవచ్చు. అనవసరంగా గాయం కలిగించడం అనుకొన్నాడు గానీ పంకజం ఈ రస్తాలో ఆలోచించనే లేదు. రామారావు తన్ను ప్రేమించాలని ఆమెకు కోరిక ఏకోశాన్నా లేదు. అతడు బాగా మాట్లాడుతాడు అంతదాకానే అతనంటే ఆమెకు అభిమానం,

తరవాత ఇద్దరూ చాలాసార్లు కలుసుకొంటూ ఉండేవాళ్ళు. ఇద్దరూ కలసి బీచికీ, సినీమాలకి వెళ్తుండేవారు. రామారావు తొల్తొలుత తనూ పంకజం వంటరిగా సాయంత్రాలు గడుపుతున్నప్పుడు మరెవరేనా పంకజం మొగ స్నేహితులు పానకంలో పుడకల్లా అడ్డొస్తున్నప్పుడు సహించేవాడు. గాని రానురాను ఇంకొకళ్ళు తమ మధ్యకి వచ్చినప్పుడు బాధపడసాగేడు. పంకజానికి ఈ బెడదే లేదు. రామారావే తన సాయంత్రాలు గడిపేటందుకు కావలసిన పనిముట్టుగా ఉండాలన్న నియమం ఆమెకు లేదు.

పంకజం రామారావుచేత తెగ వాగించేది. తన గురించి అట్టే చెప్పకుండా ఇతరుల విషయాలని చెప్పించడంలో ఆమె గట్టిది. రామారావుని చాలా ఇరుకు చిక్కులలో పడేసేది. నువ్వే అమ్మాయిని ప్రేమించలేదా అని అడిగేది ప్రేయసి ఎక్కడుంది అని అడిగేది. ఉత్తరాలు రాసుకొంటున్నారా అని



http://www.maganti.org

అడిగేది. తనకో ప్రేయసి లేదని రామారావు చెప్ప లేకపోయాడు. విధిగా టొంకి లేని ప్రేయసితో తను చేసే ప్రణయాలు పంకజానికి తెగ నివేదించేవాడు. రామారావు కవిబెట్టిన ప్రణయ కలహాలని సర్ది పెట్టేందుకు పంకజం తగు సలహా ఇచ్చేది.

మెల్లిగా రామారావుకి పంకజం నల్లమందు అయింది. వారానికి నాలుగుసార్లయినా పంకజం తోటి రెండు గంటలు గడపకపోతే ఉండలేక పోతున్నాడు. పంకజానికి మట్టుకూ రామారావు ఒక్కడే ఆటవస్తువు ఇప్పటికీ కాలేదు.

రామారావుకి ఒకనాడు స్నేహితుడు కనిపించేడు. "ఏంరా రామం ఈమధ్య బొత్తిగా కనబడడం మానేశావు" అని అడిగేడు. "ఆ లేదురా" అని మట్టుకూ రామారావు సమాధానం చెప్పాడు. అంతకన్నా హెచ్చు విషయాలని ఎవరితోటీ చెప్పడం రామారావుకి ఇష్టంలేదు. "కొంపతీసి డాక్టరీ చదివేస్తున్నావేమిటి" అని కొంటెగా అడిగేడు స్నేహితుడు. రామారావుకి తన చేతిని కాలుదాకా పంపిద్దా మనిపించింది. గాని ఆపుకొన్నాడు. స్నేహితుడు తీరుబాటుగా పంకజం ప్రవర్తన బాగు లేదనీ, అందరితోటీ విచ్చలవిడిగా తిరుగుతుందనీ, మగాళ్ళని రాసుకొని మెలుగుతుందనీ టోలెడన్ని చెప్పాడు. ఈరోజుల్లో చదువుకొంటున్నా అమ్మాయిల మనఃప్రవృత్తే అంత అని పంకజం చాలా మంచి పిల్ల అని వకాల్తీ పుచ్చుకొన్నాడు రామారావు. వాస్తవానికి తను మర్యాదా అంత ఎడంగానే పంకజంతో భౌతికంగా ఉంటున్నాడు. అలాగే పంకజం తన ఇతర మొగస్నేహితులను దూరంగా ఉంచుతుందని రామారావు నిశ్చయంగా విశ్వసించేడు. ఒకవేళ ఎవర్నైనా వంటిమీద చెయ్యి వెయ్యనిస్తే ఒక్క తననే వెయ్యనిస్తుందని రామారావు అనుకొన్నాడు.

తన ప్రేయసితో తాను పడుతున్న కష్టాలను మరికొన్ని ఊహించి వాటిని పంకజం సమక్షంలో విప్పేడు, రామారావు. పంకజం వాటినన్నిటిని "నేనే నీ ప్రేయసి నయితే వెంటనే లెంపకాయ కొట్టి-ఆవద్దురు మానేశోపున రిజిస్టరు పెళ్ళి చేసుకొంటానంది." ఈ సమాధానంమీద రామారావు గాలిలో నాలుగు పిరమిళ్ళూ, దజను తాజమహాళ్ళూ కట్టడం మొదలెట్టేడు.

గాలిలో మేడలు కట్టేటందుకు కావలసిన కలపా, ఇటికా తెచ్చు కొనేటందుకుకాక భూమి మీద సిస్తులు వసూలు చేసుకొనేటందుకు రామారావు హఠాత్తుగా ఊరెళ్ళ వలసివచ్చింది. అసలు తండ్రే వెళ్ళి అవి రాబట్టు కొంటాడుగాని ఈసారి తండ్రికి వీలులేనందువన రామారావే వెళ్ళక తప్పింది కాదు. రెండు మూడు రోజుల్లో తిరిగి వచ్చేదామనుకొన్న వాడు పదిహేను రోజులదాకా పల్లెటూరినుంచి బయట పడలేక పోయాడు. రెండు రోజులలో వచ్చేసేదానికి పంకజానికి చెప్పడమెందుకని అనుకొంటూ రామారావు వెళ్ళిపోయాడు.

అలవాటుప్రకారం రామారావు వచ్చే వేళలప్పుడు అతడికోసం పంకజం నాలుగు రోజులు ఎదురు చూసింది. అయిదో రోజు రామారావేనయి పోయాడని కొంచెం ఆందోళన కనపర్చింది గానీ ఆరో రోజునుంచీ తదితర స్నేహితులతో రామారావుని మరచిపోయింది.

రామారావు పల్లెటూరిలో తీరుబాటుగా పంకజం గురించి పగటికలలు కనడం మొదలెట్టేడు. పంకజం ఈ ఊళ్ళో ఇమడక పోయినా తనూ ఆమె ఏకాంతంగా కలకాలం చుట్టూరా కొన్ని మైళ్ళవరకూ ఎవరూ లేనిచోట ఉండిపోతే ఎలా జీవించేదీ ఆలోచించు కొనేందుకు రామారావుకి సదుపాయమైన కాలం దొరికింది. పంకజాన్ని మళ్ళా తొలిసారి కలుసుకొంటే ఏలా మాట్లాడాలో సావధానంగా రచించు కొన్నాడు.

రామారావు ఊరికి తిరిగివచ్చిన సాయంకాలం రెక్కలు కట్టుకొని పంకజం ఇంటిముందు వాలేడు



http://www.maganti.org

గానీ ఇంటికి తాళం వేసి ఉంది. మర్నాడు మూడో నాడూ, నాలుగో నాడూ కూడా అదే వరస రామారావులో కొలెడంత జెలసీ, పంకజం మీద కోపం, ఆమె శీలంమీద శంక మొదలెట్టేయి. ఈగోరుచుట్టుమీద రోకటిపోటుగా స్నేహితుడు దారిలో కనిపించి పంకజం మీద మరినాలుగు సూటీపోటీ మాటలు అన్నాడు.

సమంగా పంకజంమీద కోపం రామారావులో జనించడం మొదలవుతున్నప్పుడే పంకజంలోకూడా రామారావు మీద అభిమానం పెరగడం మొదలెట్టింది. తక్కిన మిత్రు లందరికన్నా రామారావే మాటకారి, అర్థంఉన్న బాతాఖానీ కొడతాడు. అతడు లేనిలోపాన్ని గుర్తించడం మొదలెట్టింది. దాంతో అతడు కల్పించి తనకు చెప్పే ప్రేయసి కథలన్నీ జ్ఞప్తి కొచ్చేయి. బహుశా అతడా అమ్మాయిని పెళ్ళి చేసేసుకొంటున్నా డేమో. తనకి శుభలేఖ లేకుండానే. తను రామారావుతో ఎన్నిసార్లు చెప్పింది. పెళ్ళికి నేనుమట్టుకూ ఆడపెళ్ళి వాళ్ళ తరపునే వస్తాను. ఆ అమ్మాయికి మీ అభిరుచులను నాకు తెలిసినంత క్షుణ్ణంగా తెలియవు. నేను దగ్గిరుండి ఆ అమ్మాయికి అన్నీ చెప్పాలి లేదా" అని. ఆలోచించినకొద్దీ రామారావు ఆ ఒక్క అమ్మాయికే దక్కడం పంకజాని కిప్పుడిప్పుడు ఇష్టం లేకపోతున్నది.

రామారావు ఈ సారికూడా పంకజం ఇంట్లో ఉండకపోతే మరివస్తే ఆ గుమ్మం తొక్కను అని అనుకుంటూ పంకజం గడపతొక్కాడు. అప్పుడే బయటికి బయలు దేరుతున్న పంకజం "హల్లో డాక్టరుగారూ ఇన్నాళ్లూ ఎక్కడి కెళ్ళిపోయారు, ఈతక్కినవాళ్ళ కంపెనీ భరించలేక ఇంక ఏదో తెగించబోతున్నాను" అని వేసిన తాళం తీసి లోపలికి దారితీసింది.

పంకజం తెగించబోతున్నా, పోకపోయినా రామారావుమట్టుకూ తెగించి అమాంతంగా ఆమెని ముద్దు పెట్టుకొన్నాడు. ముద్దుపెట్టుకోడం కూడా సమంగా చేతకాక సగం పెదిమలని ఆమె ముక్కుమీదే అణచాడు. పంకజం ఈ షాకులోంచి తేరుకొనేలోగా "నిన్ను విడచి ఉండలేనని ఇన్నాళ్ళకి తెల్సుకొన్నాను. నన్ను పెళ్ళాడుతావా" అని ప్రశ్నించేడు. పెళ్ళాడను అని చెప్పేలోపున అతణ్ణి కావలించుకొని బలంగా ముద్దుపెట్టుకొని "ఊఁ" అనేసింది.

రామారావు ప్రేయసి గురించిగాని, పంకజం ఇతర మొగ స్నేహితుల గురించిగాని ఒకరి మనస్తత్వాలు మరొకరు తెలుసుకొనేటందుకు వాళ్ళకు అట్టేకాలం పట్టలేదు.

పంకజం గుత్తి వంకాయకూర వండుతూఉంటే రామారావు కూర్చొని కథలు చెపుతున్నాడు. ఇరవై రోజులాయి పంకజం రామారావుతోకాక తదితరులతో తిరగడం చూసి చివరకు పంకజం రామారావుని తనవెంట కుక్కలా తిప్పుకొనలేక పోయిందన్న విజయగర్వంతో స్నేహితుడు అప్పుడే పంకజం ఇంట్లోకి అడుగుపెట్టి వీళ్ళిద్దర్నీ చూసి విభ్రాంత పోయాడు.

"మంచి సమయాని కొచ్చావురా, రా, ఇప్పుడే చెపుతున్నా రేపు మాపెళ్ళికి నువ్వు సాక్షి సంతకం పెట్టాలి" అని రామారావు అనగానే స్నేహితుడు పాలిపోయాడు. పంకజం "డాక్టరుగారూ వంకాయ వాతం చేస్తుందంటారు నిజమేనా" అని మళ్ళీ ప్రశ్నించింది.



Source: Press Academy Website, Kinnera Patrika 1949

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan